

అభివృద్ధి ఘనత బీఆర్ఎస్‌దే

తండాలను పంచాయతీలుగా తీర్చిదిద్దిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందని ఎమ్మెల్యే సబితారెడ్డి పేర్కొన్నారు. 10లో▸



సత్తా చాటాలి

స్థానిక ఎన్నికల్లో యాదవులు సత్తా చాటాలని అఖిల భారత యాదవ మహాసభ ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్‌యాదవ్ అన్నారు. 10లో▸



మాంజా విక్రయిస్తే చర్యలు

చైనా మాంజా విక్రయిస్తే చర్యలు తప్పవని ఆమనగల్లు అటవీశాఖ డిప్యూటీ రేంజ్ అధికారి జగన్మోహన్ పేర్కొన్నారు. 10లో▸

న్యూస్‌రీల్

గురుకుల ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మొయినాబాద్: ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చిలుకూరు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ దేవేందర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 5వ తరగతి ప్రవేశాలతో పాటు 6, 7, 8, 9వ తరగతుల్లో ఖాళీ సీట్లను భర్తీ చేస్తామన్నారు. గౌలిదొడ్డి ఈఐఎస్, అలుగునూరు సీఓఈ పాఠశాలల్లో 9వ తరగతిలో ప్రవేశాలకు, ఖమ్మం ఈఐఎస్, పరిగి ఎస్ఓఈ పాఠశాలల్లో 8వ తరగతిలో ప్రవేశాలకు, ఈఐఎస్ రుక్మాపూర్ సైనిక్ స్కూల్, మల్కాజిగిరి ఫైన్ ఆర్ట్స్ స్కూల్‌లో 6వ తరగతిలో ప్రవేశాలకు కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ కోసం దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 1వ తేదీ వరకు https://tgcet.cgg.gov.in వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలన్నారు. కులం, ఆదాయం, ఆధార్ కార్డు, బర్త్ సర్టిఫికెట్, ఫొటోను దరఖాస్తుకు జతచేయాలన్నారు. దరఖాస్తు చేసుకున్నవారికి ఫిబ్రవరి 23న పరీక్ష నిర్వహిస్తామన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఒలింపియాడ్‌లో ప్రతిభ చూపాలి



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న డీఈఓ సుశీందర్‌రావు తదితరులు

మొయినాబాద్: ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 21న నిర్వహించే జిల్లా స్థాయి ఇంగ్లిష్ ఒలింపియాడ్, స్పీచ్ పోటీల్లో విద్యార్థులంతా పాల్గొని, తమ ప్రతిభ చాటాలని జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు అన్నారు. ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు మొగులయ్య, ప్రధాన కార్యదర్శి సలోమి స్నేహలత తదితరులతో కలిసి ఒలింపియాడ్, స్పీచ్ పోటీలకు సంబంధించిన కరపత్రాన్ని గురువారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంగ్లిష్ భాషా నైపుణ్యం పోటీలు ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఇలాంటి పోటీల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థుల్లో భయం పోయి ఆత్మవిశ్వాసం పెరుగుతుందని చెప్పారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు వీరప్ప, రజిని, లక్ష్మణ్, బాలాజీ, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశికి చిలుకూరులో ఏర్పాట్లు

మొయినాబాద్: వైకుంఠ ఏకాదశి సందర్భంగా శుక్రవారం చిలుకూరు బాలాజీ దేవాలయానికి భారీగా భక్తులు తరలిరానున్నారు. ఇక్కడి ఆలయానికి వైకుంఠ ద్వారం లేకున్నా ఏటా వైకుంఠ ఏకాదశి రోజు భక్తులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. ఈసారి కూడా అదే స్థాయిలో వచ్చే అవకాశం ఉండడంతో వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ అర్చకుడు రంగరాజన్ తెలిపారు. ధనుర్మాసం, వైకుంఠ ఏకాదశి సందర్భంగా స్వామివారికి విశిష్ట పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు.

స్థానిక ఎన్నికలకు సిద్ధంగా ఉండండి

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



భట్టి విక్రమార్కను సత్కరించిన కాంగ్రెస్ నాయకులు

ఆమనగల్లు: స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సూచించారు. రాష్ట్రంలో అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని తెలిపారు. నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల పర్యటనకు వెళ్తున్న ఆయనతో పాటు ఎంపీ మల్లురవికి ఆమనగల్లు పట్టణంలో పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మల్లు భట్టివిక్రమార్క మాట్లాడుతూ.. అందరూ కలిసికట్టుగా పనిచేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో ఘనవిజయం సాధించాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో ప్రజాపాలన కొనసాగుతోందని చెప్పారు. స్వాగతం పలికిన వారిలో పీసీసీ సభ్యుడు అయిల శ్రీనివాస్‌గౌడ్, మాజీ సర్పంచ్ కేశవులు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు మండ్లి రాములు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వస్పుల శ్రీశైలం, యూత్‌కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఉదయం ఇంటర్.. మధ్యాహ్నం డిగ్రీ



షిఫ్ట్ పద్ధతిలో తరగతులు	వేధిస్తున్న భవనాల కొరత	ఇంకా చెట్టు కింద చదువులే..	అరకొర సౌకర్యాలు	విద్యార్థులకు తప్పని ఇక్కట్లు



ఇది ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల. ప్రస్తుతం ఇక్కడ 257 మంది చదువుతున్నారు. ఐదేళ్ల క్రితం పట్టణానికి జూనియర్ కళాశాల మంజూరైంది. అప్పటికే ఉన్న పాఠశాల భవనంలో ఐదు గదులను జూనియర్ కాలేజీకి కేటాయించారు. ప్రస్తుతం ఇందులో 294 మంది ఇంటర్ చదువుతున్నారు. 2024–25 విద్యా సంవత్సరంలో డిగ్రీ కాలేజీని మంజూరు చేశారు. ఫస్టియర్‌లో 19 మంది అడ్మిషన్ పొందారు. సొంత భవనం లేకపోవడంతో ఆ కోర్సులను కూడా ఇదే భవనంలో కొనసాగిస్తున్నారు. అసలే గదుల కొరత, ఆపై అదనపు తరగతులు మంజూరు చేయడంతో విధిలేని పరిస్థితుల్లో ఇంటర్ విద్యార్థులను చెట్లకింద కూర్చొబెట్టి చదువు చెప్పాల్సి వస్తోంది. విద్యార్థుల నిష్పత్తి మేరకు మరుగుదొడ్లు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు.

సౌకర్యాలు లేవు



కాలేజీలో ఉదయం ఇంటర్, మధ్యాహ్నం డిగ్రీ విద్యార్థులు చదువుకోవాల్సి వస్తోంది. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు లేవు. భవనం శిథిలావస్థకు చేరింది. ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి. చెట్టు నీడలో చదువుకోవాల్సి వస్తోంది. కొత్త భవనం నిర్మించి సౌకర్యాలు కల్పించాలి.

– అశ్విని, ఎంపీసీ సెకండియర్, ఆమనగల్లు

చిత్రంలో కన్పిస్తున్నది ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఇంటర్మీడియట్ కాలేజీ ప్రాంగణం. రెండు అంతస్తుల ఈ భవనంలో 22 గదులు ఉన్నాయి. ఇంటర్మీడియట్‌లో 650 మంది, డిగ్రీలో 510 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు ఇంటర్ తరగతులు నిర్వహిస్తే.. మధ్యాహ్నం 1.30 నుంచి సాయంత్రం 5.30 వరకు డిగ్రీ తరగతులు కొనసాగిస్తున్నారు. రోజుకు ఆరు గంటలు పని చేయాలనే యూజీసీ నిబంధనల మేరకు ఫ్యాకల్టీ ఉదయం 11.30 గంటలకే కాలేజీకి చేరుకుంటున్నారు. మధ్యాహ్నం వరకు ఖాళీగా కూర్చోవాల్సి వస్తోంది.



సాక్షి, రంగారెడ్డిజిల్లా: ప్రభుత్వాలు మారినా.. పాలకులు మారినా విద్యార్థులకు మాత్రం ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికీ ఉన్నత చదువులకు చెట్ల నీడే దిక్కవుతోంది. విద్యార్థుల నిష్పత్తి మేరకు భవనాలు లేకపోవడంతో ఒకే ప్రాంగణంలో షిఫ్టుల పద్ధతిలో తరగతులు నిర్వహించాల్సి వస్తోంది. ఉదయం ఇంటర్మీడియట్ విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధిస్తే.. మధ్యాహ్నం తర్వాత అదే తరగతి గదుల్లో డిగ్రీ విద్యార్థులకు క్లాసులు చెప్పాల్సి వస్తోంది. పరీక్షలు, రివిజన్ క్లాసులు చెట్ల నీడలో కొనసాగుతున్నాయి. ఇబ్రహీంపట్నం, ఆమనగల్లు, హయత్‌నగర్ సహా పలు డిగ్రీ కాలేజీల్లో ఇదే పరిస్థితి.

- హయత్‌నగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలోనే డిగ్రీ కళాశాల కూడా కొనసాగుతోంది. రెండు అంతస్తుల ఈ భవనంలో సుమారు 300 మంది విద్యార్థులు చదువుతున్నారు. డిగ్రీ విద్యార్థుల నిష్పత్తి మేరకు తరగతి గదులు లేకపోవడంతో బీఏ, బీఎస్సీ, బీకాం కోర్సులకు వేర్వేరు సమయాల్లో తరగతులు నిర్వహిస్తున్నారు.
- మహేశ్వరం డిగ్రీ కాలేజీకి సొంత భవనం లేకపోవడంతో అద్దె భవనంలో తరగతులు జరుగుతున్నాయి.
- 2018లో వినోబానగర్‌లో రూ.4 కోట్ల అంచనా వ్యయంతో ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కాలేజీకి శంకుస్థాపన చేశారు. 18 గదులతో భవనాన్ని నిర్మించినా చుట్టూ ప్రహరీ ఏర్పాటును విస్మరించారు. దీంతో పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. ఫర్నిచర్ కూడా ఇవ్వలేదు. సరైన రవాణా సదుపాయం లేని ఈ భవనంలోకి వచ్చేందుకు విద్యార్థులు విముఖత చూపుతున్నారు.





కమ్మేసిన మంచు తెరలు

ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పడిపోతున్నాయి.. తెల్లవారుజామున పొగమంచు కమ్మేస్తోంది. ఉదయం ప్రయాణించే వాహనదారులు దారి సరిగా కనిపించక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం 8 గంటల వరకు పొగమంచు ఉండడంతో లైట్లు వేసుకొని వెళ్తున్నారు. షాబాద్ మండల పరిధిలో గురువారం ఈ దృశ్యాలు కనిపించాయి.

– షాబాద్

విధి నిర్వహణలో అలసత్వం తగదు



సేంద్రియ ఎరువుల తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీఓ సురేష్ మోహన్

జిల్లా పంచాయతీ అధికారి సురేష్ మోహన్

షాద్‌నగర్: విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా పంచాయతీ అధికారి సురేష్‌మోహన్ హెచ్చరించారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కమ్మదనం గ్రామాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో పల్లె ప్రకృతి వనం, సేంద్రియ ఎరువుల తయారీ కేంద్రం, డంపింగ్ యార్డును పరిశీలించారు. పల్లె ప్రకృతి వనంలో సరైన నిర్వహణ లేక పిచ్చి మొక్కలు మొలవడం.. డంపింగ్ యార్డు ఆవరణలో విచ్చలవిడిగా చెత్తను పారబోయడంతో పరిసరాల్లో కాలుష్యం అవుతుండడం.. సేంద్రియ ఎరువుల తయారీ షెడ్డు వాడుకలో లేకపోవడాన్ని గమనించి పంచాయతీ కార్యదర్శి జగదీశ్వర్‌పై అసహనం వ్యక్తం చేశారు. అనంతరం డీపీఓ పంచాయతీ రికార్డులను పరిశీలించారు. గ్రామస్తుల నుంచి వసూలు చేసిన రూ.19,547 పన్నులను ట్రెజరీలో డిపాజిట్ చేయకుండా తన దగ్గర ఉంచుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే షోకాజ్ నోటీసు జారీ చేశారు. తనిఖీల్లో ఎంపీడీఓ బన్సీలాల్, ఎంపీఓ జయంత్‌రెడ్డి పాల్గొన్నారు.

కుర్మిద్దలో పోలీస్ బందోబస్తు మధ్య మార్కింగ్ వేస్తున్న సిబ్బంది



పోలీస్ పహారాలో గ్రీన్ ఫీల్డ్ సర్వే

యాచారం: కుర్మిద్ద గ్రామ రెవెన్యూ పరిధిలోంచి వెళ్లే గ్రీన్ ఫీల్డ్ రోడ్డు సర్వే గురువారం పోలీస్ బందోబస్తు మధ్య జరిగింది. కొంగర్‌కలాన్ ఓఆర్ఆర్ నుంచి ఇబ్రహీంపట్నం, కందుకూరు, యాచారం, కడ్తాల్, ఆమనగల్లు మండలాల్లో నిర్మించే 330 అడుగుల గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు సర్వేను కొద్ది రోజులుగా టీజీఐఐసీ, రెవెన్యూ అధికారులు ముమ్మరంగా చేపట్టారు. అందులో భాగంగానే యాచారం మండలం కుర్మిద్ద గ్రామ రెవెన్యూ పరిధిలోని పట్టా భూములు సర్వే నంబర్ 284, 285, 286, 287లతో పాటు అసైన్డ్ భూమి సర్వే నంబర్ 311 నుంచి 330 అడుగుల గ్రీన్ ఫీల్డ్ రోడ్డును నిర్మించడానికి అధికారులు సర్వే చేసి మార్కింగ్ వేశారు. రైతులు అడ్డుకుంటారనే ముందస్తు సమాచారంతో ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు ఆధ్వర్యంలో హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ, యాచారం పీఎస్‌ల సీఐలు లిక్కి కృష్ణంరాజు, నర్సింహారావు పర్యవేక్షణలో పెద్ద సంఖ్యలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. స్థానిక రైతులు సర్వేను అడ్డుకోవడానికి ప్రయత్నించగా ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత్‌రెడ్డి, ఏసీపీ కేపీవీ రాజు వారికి నచ్చజెప్పారు. ఏమైనా సమస్యలుంటే వినతిపత్రాలు ఇవ్వాలని, సర్వేను అడ్డుకోవద్దని స్పష్టం చేశారు. దీంతో రైతులు ఆర్డీఓ అనంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం సర్వే ప్రశాంతంగా కొనసాగింది. కార్యక్రమంలో యాచారం తహసీల్దార్ అయ్యప్ప, పలువురు రెవెన్యూ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేటుకు దీటుగా ఫలితాలు సాధించాలి

కలెక్టర్ నారాయణ రెడ్డి



విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్ నారాయణ రెడ్డి

తుర్కయంజాల్: ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో చదివిన ఎందరో మేధావులు, రాజకీయ వేత్తలు, అధికారులుగా ఉన్నత స్థానాలకు ఎదిగిన వారు ఉన్నారని.. విద్యార్థులు వారిని ఆదర్శంగా తీసుకోవాలని కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సూచించారు. గురువారం ఇబ్రహీంపట్నం రెవెన్యూ డివిజనల్ సిబ్బంది ఏర్పాటు చేసిన షెడ్యూల్ కులాల వసతి గృహ విద్యార్థుల దుప్పట్లు, పుస్తకాల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులు ఎదగాలంటే చదువు, నిబద్ధత కలిగి ఉండాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఫలితాలను సాధించాలని ఆకాంక్షించారు. రెవెన్యూ సిబ్బంది ముందుకు వచ్చి విద్యార్థులకు సాయం చేయడం అభినందించదగ్గ విషయమని కొనియాడారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత రెడ్డి, ఎమ్మార్వోలు సునీతా రెడ్డి, ఎం.వి.ప్రసాద్ రావు, అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ సుదర్శన్ రెడ్డి, హాస్టల్ స్పెషల్ ఆఫీసర్, డీఎల్‌పీఓ సాధన, సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్ ఆఫీసర్ కుసుమల లావణ్య తదితరులు పాల్గొన్నారు.

‘అపార్’.. ఆలస్యం!

నమూనా కార్డు



విద్యార్థుల వివరాల నమోదులో జాప్యం

- ఆధార్‌కార్డు, పాఠశాలలో తేడాలతో ఇబ్బందులు
- ఆధార్ సెంటర్ల చుట్టూ తల్లిదండ్రుల ప్రదక్షిణలు
- ఈనెల 31 తుది గడువు
- వందశాతం లక్ష్యం చేరేనా?

కేశంపేట: విద్యార్థులకు శాశ్వత నంబర్ ఇచ్చేందుకు చేపట్టిన అపార్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) నమోదుకు తిప్పలు తప్పడం లేదు. అపార్‌లో విద్యార్థి వివరాలు ఒక్కసారి నమోదు చేస్తే ఎప్పుడైనా, ఎక్కడైనా సర్టిఫికెట్లు, విద్యార్హత సమాచారం తేలిగ్గా పొందొచ్చు. ఇంత వరకు బాగానే ఉన్నా నమోదులో మాత్రం ఇబ్బందులు తప్పడం లేదు. ప్రభుత్వం ఈనెల 31 వరకు గడువు ఇచ్చింది. కానీ సంక్రాంతి సెలవుల నేపథ్యంలో గడువులోగా వందశాతం నమోదు సాధ్యమయ్యేలా లేదు. మరోవైపు అపార్‌తో తల్లిదండ్రులు ఆధార్ నమోదు కేంద్రాల వైపు తిరిగేలా చేస్తోంది.

ఏమిటీ అపార్..

జాతీయ విద్యావిధానంలో భాగంగా దేశంలో ప్రతి విద్యార్థి విద్యార్హతలతో పాటు, పాఠశాల వివరాలు ఒకే కార్డులో నమోదు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అపార్ తీసుకువచ్చింది. ఇందులో విద్యార్థి పూర్తి వివరాలు నమోదు చేస్తారు. ఆ తర్వాత నమోదు చేసిన వివరాలతో విద్యార్థులకు ఐడీ కార్డు అందిస్తారు. 12 అంకెల విశిష్ట సంఖ్యతో ఇది విద్యార్థికి అకాడమిక్ పాస్‌పోర్టులా ఉపయోగపడుతుంది. ఒకటో తరగతి నుంచి గ్రాడ్యుయేట్ వరకు విద్యార్థి ఎక్కడ చదివాడు.. ఏతరగతిలో ఎన్ని మార్కులు వచ్చాయి.. అనే వివరాలను కార్డులో పొందుపర్చుతారు. విద్యార్థి ఉన్నత చదువుల అనంతరం ఉద్యోగాన్వేషణలో దరఖాస్తు సమయంలో అపార్ నంబర్ నమోదు చేస్తే సరిపోతుంది. విద్యార్థి వివరాలు, నైపుణ్యాలు అందులోనే వెల్లడికానుండడంతో ఎంపిక సమయంలో అధికారులు, కంపెనీలకు దరఖాస్తుదారుడి ప్రతిభ తెలుస్తుంది.

డీజీ లాకర్

విద్యార్థుల సర్టిఫికెట్లు భద్రపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం డీజీ లాకర్‌ను ఉపయోగిస్తోంది. ఇది ఆండ్రాయిడ్, ఐఫోన్‌లలో ప్లేస్టోర్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. తద్వారా విద్యార్థి తన సర్టిఫికెట్లు, తనకు ఉండే ప్రత్యేక పాస్‌వర్డ్ ద్వారా వివరాలను ఎప్పుడైనా, ఎక్కడైనా తెలుసుకోవచ్చు. అపార్ నంబర్ ద్వారా ఉద్యోగాలకు దరఖాస్తు కూడా చేసుకోవచ్చు.

తప్పులు సరి చేసేందుకు..

విద్యార్థుల ఆధార్ కార్డులో, పాఠశాలలో నమోదైన వివరాల్లో తప్పులుంటే విద్యార్థి తల్లిదండ్రుల అభిప్రాయం మేరకు మార్పులకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ప్రాథమిక పాఠశాలలు, ప్రైవేట్ పాఠశాలల్లో చదివే విద్యార్థుల మార్పులకు మండల విద్యాధికారికి అనుమతి ఇచ్చింది. ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులకు అనుమతి ఉంది. ప్రస్తుతం ఆధార్ కార్డులో, పాఠశాలలో అడ్మిషన్ రిపోర్టులో సక్రమంగా ఉన్న విద్యార్థుల వివరాలను ఉపాధ్యాయులు ముందుగా నమోదు చేస్తున్నారు.


నమోదు ఇలా..

ప్రభుత్వం పాఠశాలలకు ల్యాప్‌టాప్‌లు, ఉన్నత పాఠశాలలకు కంప్యూటర్లు అందించింది. ఆధార్ కార్డులో, పాఠశాలలో అడ్మిషన్‌లో సక్రమంగా ఉన్న విద్యార్థుల వివరాలను ఉపాధ్యాయులు పాఠశాల యూడైస్ ద్వారా నమోదు చేస్తున్నారు. యూడైస్‌కు లాగిన్ అయిన తర్వాత స్కూల్ రిజిస్టర్‌లో ఉన్న వివరాలు, విద్యార్థుల ఆధార్ కార్డులోని వివరాలను సరిచూస్తున్నారు. వివరాలు సక్రమంగా లేకుంటే విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం అందిస్తున్నారు. అనంతరం వారు చెప్పిన వివరాలను ఎంట్రీ చేస్తున్నారు.

ఎదురవుతున్న సమస్యలు

- పాఠశాల అడ్మిషన్ రిజిస్టర్ ఉన్న విద్యార్థి పుట్టినతేదీకి ఆధార్ కార్డులో ఉన్న తేదీకి పొంతన ఉండడం లేదు.
- పుట్టిన తేదీని మార్చుకునేందుకు ఆధార్ సెంటర్లకు వెళ్తున్న విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. పుట్టిన తేదీని మార్చేందుకు బర్త్ సర్టిఫికెట్ అడుగుతున్నారు. చాలా మందికి సర్టిఫికెట్లు లేక ఇబ్బందులు పడుతున్నారు.
- ఆధార్ కార్డులో తప్పులను సరిచేయలేక విద్యార్థుల తల్లిదండ్రులు స్కూల్ సర్టిఫికెట్లలో మార్పులు చేస్తున్నారు.
- కొద్దిమంది విద్యార్థులకు ఇంటిపేరు పూర్తిగా లేకుండా మొదటి అక్షరంతో మాత్రమే నమోదు చేసుకున్నారు. దీన్ని ఇలాగే అపార్‌లో నమోదు చేస్తే భవిష్యత్‌లో పాస్‌పోర్టు, వీసాలకు ఇబ్బందులు ఎదురవుతాయని ఆందోళన వ్యక్తమవుతోంది.

గడువులోగా పూర్తి చేస్తాం



ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలతో పాటు కేజీబీవీ, గురుకులాలు, జూనియర్ కళాశాల్లో అపార్ నమోదు ప్రక్రియ ప్రారంభమైంది. ఎంట్రీలో కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సమస్యలను అధిగమించి ప్రభుత్వం సూచించిన గడువులోగా నమోదుకు కృషి చేస్తాం.

– చంద్రశేఖర్, మండల విద్యాధికారి, కేశంపేట

భూములిచ్చి సహకరించాలి


రైతులతో సమావేశమైన ఆర్డీఓ, డిప్యూటీ కలెక్టర్

కందుకూరు: ప్యూచర్ సిటీ వరకు నిర్మించనున్న రహదారికి భూములిచ్చి సహకరించాలని ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి రైతులను కోరారు. రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న మండల పరిధిలోని తిమ్మాపూర్ రెవెన్యూలోని రైతులతో గురువారం భూసేకరణ డిప్యూటీ కలెక్టర్ రాజుతో కలిసి కందుకూరు ఆర్డీఓ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రైతుల అభిప్రాయాలు సేకరించారు. ఆ ప్రాంతంలో ఎకరా రూ.4 కోట్ల వరకు ధర ఉందని కనీసం రూ.2 కోట్ల చొప్పున ఇవ్వాలని లేదంటే ల్యాండ్ పూలింగ్ కింద అయినా సేకరిస్తే తమ భూములు ఇస్తామని రైతులు స్పష్టం చేశారు. అధికారులు మాత్రం 2013 చట్టం ప్రకారం ధర చెల్లిస్తామన్నారు. దీంతో రైతులు తమ అభిప్రాయాలు చెప్పి వచ్చారు. కార్యక్రమంలో ఆర్ఐలు యాదయ్య, శ్రీకాంత్ పాల్గొన్నారు.

17 నుంచి గ్రామ సభలు

రహదారి నిర్మాణంలో భూములు సేకరిస్తున్న గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు. 17న మీర్‌ఖాన్‌పేటలో, 18న తిమ్మాపూర్, 20న రాచులూరు, 21న లేమూరు, 22న గుమ్మడవెల్లిలో సభలు ఉంటాయన్నారు.

మోడల్ స్కూల్ ఉపాధ్యాయురాలికి డాక్టరేట్


డాక్టరేట్ సాధించిన జ్యోతిని సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

కందుకూరు: మండలంలోని నేదునూరు పరిధిలోని మోడల్ స్కూల్‌లో తెలుగు ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వర్తిస్తున్న ధరావత్ జ్యోతి తెలుగు సాహిత్యంలో డాక్టరేట్(పీహెచ్‌డీ పట్టా) సాధించారు. ఓరియంటల్ డిపార్ట్‌మెంట్ డీన్, తెలంగాణ సారస్వత పరిషత్ ప్రాచ్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అజ్మీరా సిల్మానాయక్ పర్యవేక్షణలో నాగర్ కర్నూల్ జిల్లా 'బంజారా మౌఖిక సాహిత్యం-పరిశీలన' అంశంపై పరిశోధనలు చేసి ఓయూలోని తెలుగు శాఖకు తన సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించారు. ఇందుకుగాను డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా గురువారం మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ విష్ణుప్రియతో పాటు ఉపాధ్యాయులు జ్యోతిని ఘనంగా సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసాచారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విహారయాత్రలో విషాదం

వేవ్ పూల్‌లో పడి విద్యార్థి దుర్మరణం


ఫైజాన్ మృతదేహం

శంకర్‌పల్లి: విహారయాత్రలో విషాదం చోటు చేసుకుంది. అప్పటి వరకు అందరితో పాటు అల్లరి చేస్తూ ఆడుకుంటున్న బాలుడు.. ఒక్కసారిగా కుప్పకూలి విగతజీవిగా మారాడు. వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్ శాలిబండకు చెందిన గులాం రసూల్ అన్సారీ, రఫియా దంపతుల కుమారుడు ఫైజాన్(12), జహనుమా (బహదుర్‌పురా సమీపం)లోని మదీనా మిషన్ హైస్కూల్‌లో 6వ తరగతి చదువుతున్నాడు. గురువారం పాఠశాల యాజమాన్యం 65మంది విద్యార్థులను ఒక రోజు విహారయాత్ర నిమిత్తం శంకర్‌పల్లి మండలం వైల్డ్ వాటర్స్(ఫామ్ ఎక్సోటికా)కి తీసుకెళ్లారు. మధ్యాహ్నం 1.30 గంటల ప్రాంతంలో వేవ్ పూల్‌లో ఆడుకుంటున్నారు. ఆ సమయంలో ఫైజాన్ ఊపిరి ఆడక కింద పడిపోయాడు. దీంతో అక్కడి వారు హుటాహుటినా శంకర్‌పల్లిలోని లైఫ్ కేర్ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. బాలుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.

ఆకాశాన్నంటిన పప్పుల ధరలు

మాంసకృతులు సమృద్ధిగా ఉన్న వంటకంలో పప్పు దినుసులు ముందువరుసలో నిలుస్తాయి. భోజనంలో కాస్త పప్పుతో తినాలని అందరూ కోరుకుంటారు. కానీ.. ఇప్పుడు ఆ ఆశ వదులుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. పెరిగిన ధరలతో పప్పు సామాన్యుడి దరికి చేరనంటోంది.

రూ.180కి చేరిన కంది పప్పు

- ఇబ్బంది పడుతున్న సామాన్య, మధ్యతరగతి కుటుంబాలు



పప్పుల ధరలు ఇలా.. (కిలో)

కంది	రూ.180
పెసర	రూ.120
శనగ	రూ.100
మినపప్పు	రూ.140
బొబ్బెరపప్పు	రూ.80

దౌల్తాబాద్: నిత్యావసరాల్లో ప్రధానమైనవి పప్పు దినుసులు. కొంతమందికి ప్రతి రోజు పప్పుకూర లేనిదే నోట్లోకి ముద్ద దిగదు. అలాంటిది ప్రస్తుతం పప్పుల ధరలు భారీగా పెరగడంతో పప్పన్నం తినాలంటే ప్రజలు వెనుకంజ వేసే పరిస్థితి నెలకొంది. గతంలో దేశవ్యాప్తంగా పప్పుదినుసుల ఉత్పత్తులు పెరగడంతో ధరలు తక్కువగా ఉండేవి. ప్రస్తుతం పప్పుదినుసుల ధరలు చుక్కలంటుతున్నాయి. మార్కెట్లో కూరగాయల ధరలు కొండెక్కి కూర్చున్న తరుణంలో పప్పుదినుసుల ధరలు సైతం పెరగడంతో సామాన్యులు ఆందోళన చెందుతున్నారు. సమతుల భోజనానికి అవస్థలు పడాల్సి వస్తుందని వాపోతున్నారు.

రోజంతా కూలీ చేసినా..

ప్రస్తుతం పప్పు దినుసుల ధరలు అమాంతంగా పెరగడంతో ప్రజలు కొనుగోళ్లు చేయడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పెరిగిన పప్పుల ధరలతో పేద, మధ్య తరగతి కుటుంబాల్లో పప్పు లేకుండానే భోజనం చేయాల్సి వస్తుందని వాపోతున్నారు. రోజంతా కూలీ చేసినా కూడా కిలో పప్పు కొనలేకపోతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా ఈ సీజన్‌లో కూరగాయాల ధరలు తక్కువగా ఉండాలి. కానీ ప్రస్తుతం ధరలు మండుతున్నాయి. ఉల్లిగడ్డ ధరలు పెరగడంతో పాటు ఇతర కూరగాయాల ధరలు పెరగడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

నియంత్రణేది?

ప్రస్తుతం పప్పు దినుసుల ధరలు భారీగా పెరగడంతో కొనడానికి ప్రజలు ముందుకు రావడం లేదని వ్యాపారులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం మార్కెట్లో పప్పుల అమ్మకాలు అంతంత మాత్రంగానే సాగుతున్నాయి. పప్పుల ధరలు అమాంతంగా పెరిగినా వాటి నియంత్రణలో అధికార యంత్రాంగం విఫలమైందని ఆరోపిస్తున్నారు. పప్పుల ధరలు నియంత్రించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ప్రజలు పేర్కొంటున్నారు. తక్కువ వేతనం ఆర్జిస్తున్న శ్రమ జీవులకు పప్పు ధరలు చుక్కలు చూపిస్తున్నాయి.

ధరలు తగ్గించాలి



ప్రతి ఏడాది పప్పుల ధరలు పెరుగుతున్నాయి. దీంతో పేద ప్రజలు చేసిన సంపాదనంతా పప్పు, ఉప్పులకే వెచ్చిస్తున్నారు. పప్పు దినుసుల ధరలు అమాంతంగా పెరగడంతో ఇబ్బంది పడుతున్నారు. కొత్త ప్రభుత్వం రేషన్‌షాపుల్లో పప్పులు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి.

– వెంకటయ్య, దౌల్తాబాద్

భర్తను చంపిన భార్యకు రిమాండ్

ఇబ్రహీంపట్నం రూరల్: భర్తను చంపిన భార్యను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీకాకుళం చెందిన షణ్ముఖరావును తాగినమైకంలో హత్య చేసిన భార్య ఉమాపతిని గురువారం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి


యాదవ మహాసభ జిల్లా క్యాలెండర్ ఆవిష్కరణలో పాల్గొన్న నాయకులు

అఖిల భారత యాదవ మహాసభ జాతీయ ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్‌యాదవ్

మొయినాబాద్‌రూరల్: ఆర్ఎస్ఎస్ తరువాత అఖి ల భారత యాదవ మహాసభ వందేళ్లు పూర్తి చేసుకుందని.. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో అధికంగా యాదవులే ఉన్నారని అఖిల భారత యాదవ మహాసభ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణ్‌యాదవ్ అన్నారు. మండల పరిధిలోని అజీజ్ నగర్ చౌరస్తాలో గల పీవీ కన్వెన్షన్ హాల్‌లో గురువారం జిల్లా యాదవ మహాసభ క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని మాజీ సర్పంచ్ బత్తుల సుధాకర్‌యాదవ్ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆర్.లక్ష్మణ్‌యాదవ్‌తో పాటు రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు బొంతు శ్రీదేవి హాజరై క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో యాదవులంతా ఐక్యమత్యం చాటాలని అన్నారు. స్థానిక ఎన్నికల్లో బీసీలకు ఇచ్చే 42 శాతం రిజర్వేషన్లలో యాదవులకు కూడా సముచిత న్యాయం ఉండాలన్నారు. కార్యక్రమంలో అఖిల భారత యాదవ మహాసభ జాతీయ కార్యదర్శి లక్ష్మణ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజేందర్‌యాదవ్, జిల్లా సభ అధ్యక్షుడు సుధాకర్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి రఘునందన్‌యాదవ్, యువజన విభాగం అధ్యక్షుడు లక్ష్మీపతియాదవ్, ఉపాధ్యక్షుడు యాదగిరి యాదవ్, మాజీ ఎంపీపీ శ్రీహరియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణంలో చోరీ

నగదు, సీసాలు అపహరణ

శంకర్‌పల్లి: ఓ మద్యం దుకాణంలో బుధవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఈ సంఘటన శంకర్‌పల్లి పట్టణంలో చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణ శివారులోని సింగాపురం గేట్ వద్ద 'వెస్ట్ సైడ్' పేరుతో రఘునందన్‌రెడ్డి అనే వ్యక్తి మద్యం దుకాణం నడుపుతున్నాడు. రోజు మాదిరిగానే రాత్రి షాపునకు తాళం వేసి వెళ్లారు. రాత్రి వేళ గుర్తు తెలియని దుండగులు సీసీ కెమెరాలను ధ్వంసం చేసి, షాపు షట్టర్ తాళాలు పగులగొట్టి లోపలికి చొరబడ్డారు. కౌంటర్‌లోని రూ.30 వేల నగదుతో పాటు.. రూ.10వేల విలువ గల మద్యం సీసాలను అపహరించారు. గురువారం ఉదయం అటుగా వెళ్తున్న వారు.. షట్టర్ తాళాలను పగులగొట్టి ఉండటాన్ని గమనించి షాపు యజమానికి సమాచారం ఇచ్చారు. దీంతో సదరు నిర్వాహకుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

తండాల అభివృద్ధి ఘనత బీఆర్‌ఎస్‌దే

ఎమ్మెల్యే సబితారెడ్డి


నూతన పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

మహేశ్వరం: తండాలను పంచాయతీలుగా తీర్చిదిద్దిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని ఎమ్మెల్యే పి.సబితారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని పడమటి తండాల్లో జాతీయ గ్రామీణా ఉపాధి హామీ పథకం నిధులు రూ.20 లక్షలతో చేపట్టిన నూతన పంచాయతీ భవనాన్ని గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పరిపాలనా సౌలభ్యం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం, మాజీ సీఎం కేసీఆర్ తండాలు, అనుబంధ గ్రామాలను పంచాయతీలుగా మార్చారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో పంచాయతీల అభివృద్ధికి ఒక్క పైసా విడుదల చేయడం లేదని విమర్శించారు. రైతులకు సంపూర్ణ రుణ మాఫీ చేయలేదని, ఇప్పటి వరకు రైతు భరోసా ఇవ్వకుండా కాలయాపన చేస్తోందని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే రాబోయే రోజుల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు.

కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్

ప్రారంభోత్సవ కార్యక్రమం కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్ అన్నట్లుగా సాగింది. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు, కలెక్టర్ అనుమతి లేకుండా ఎమ్మెల్యే సబితారెడ్డి ఎలా పంచాయతీ భవనం ప్రారంభిస్తారని ప్రశ్నించారు. ఆమెకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎమ్మెల్యే ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కొంత సేపటికి ఎమ్మెల్యే సబితారెడ్డి తన అనుచరులతో వచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. ఈ క్రమంలో పరిస్థితి చేజారకుండా పోలీసులు రంగంలోకి దిగారు. ఇరు వర్గాలను చెదరగొట్టారు.

పాత నేరస్తులను పట్టుకోవడం సులువు

- వేలిముద్రల మ్యాచింగ్ ద్వారా గుర్తింపు
- సీఐ సీతారామ్


పాపిలాన్ మిషన్ ద్వారా వేలిముద్రలను పరిశీలిస్తున్న పోలీసులు

కందుకూరు: పాత నేరస్తులు మళ్లీ ఏదైనా నేరం చేస్తే వారిని వేలి ముద్రల సహాయంతో గుర్తించవచ్చని సీఐ సీతారామ్ తెలిపారు. స్థానిక కూడలిలో గురువారం పాపిలాన్ మిషన్ యంత్రం(ఫింగర్ మ్యాచ్ చేసే మిషన్)సాయంతో వాహనాల తనిఖీ నిర్వహించారు. పలువురి వేలు ముద్రలను పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడారు. నేషనల్ క్రైం రికార్డు బ్యూరో ద్వారా కొద్ది రోజులుగా పాపిలాన్ మిషన్‌తో నేరస్తులను పట్టుకునే వెసులుబాటు అందుబాటులోకి తెచ్చిందని తెలిపారు. దీంతో ఒకసారి శిక్ష అనుభవించిన వారి వేలిముద్రలను కంప్యూటరీకరించడంతో.. దేశంలో ఎక్కడైనా ఏదైనా నేరం జరిగితే, అనుమానితులుగా భావించిన వ్యక్తిని యంత్రం సహాయంతో పట్టుకోవచ్చునని పేర్కొన్నారు. రద్దీ ప్రదేశాలు, వాహనాల తనిఖీ, గ్రామాల్లో పెట్రోలింగ్ చేసే సమయాల్లో అనుమానితులుగా ఎవరినైనా కనిపిస్తే.. వారి వేలిముద్రల మ్యాచ్‌ను పరిశీలించి, నిందితుల ఆచూకీ తెలుసుకోవచ్చునని వెల్లడించారు. గంజాయి విక్రయాలు, స్మగ్లింగ్, దొంగతనాలు, లూటీ, హత్యలు చేసి గతంలో అరెస్టు అయినవారి వేలిముద్రలు పాపిలాన్ మిషన్‌లో నిక్షిప్తమై ఉంటాయని, దీంతో అలాంటి వారు మళ్లీ తారసపడితే ఇక్కడికి ఎందుకు వచ్చాడు? ఏం చేశాడు అనే కోణంలో విచారించవచ్చునని వివరించారు.

చైనా మాంజా విక్రయిస్తే చర్యలు

అటవీశాఖ డిప్యూటీ రేంజ్ అధికారి జగన్మోహన్


కిరాణా దుకాణంలో తనిఖీ చేస్తున్న డీఆర్‌ఓ

ఆమనగల్లు: ప్రమాదరకరమైన చైనా మాంజా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆమనగల్లు అటవీశాఖ డిప్యూటీ రేంజ్ అధికారి జగన్మోహన్ హెచ్చరించారు. గురువారం పట్టణంలోని పలు కిరాణాషాపులు, పతంగుల విక్రయాల దుకాణాలను అటవీశాఖ సిబ్బందితో కలిసి ఆయన తనిఖీ చేశారు. మాంజాపై అవగాహన కల్పించి మాట్లాడారు. చైనా మాంజాతో మనుషులతో పాటు పక్షులకు ప్రమాదం పొంచి ఉందని తెలిపారు. ఈ ప్రమాదం గురించి.. తల్లిదండ్రులు పిల్లలకు అర్థమయ్యేలా వివరించాలని సూచించారు. చాకులా కోసుకుపోయే మాంజాతో పతంగులు ఎగురవేయడం ప్రమాదకరమని, అలాంటివి జరగకుండా పెద్దలు, పిల్లలు జాగ్రత్తగా ఉండాలని కోరారు. తనిఖీల్లో శాఖ సిబ్బంది అన్వర్ హుస్సేన్, రాఘవేంద్ర తదితరులు ఉన్నారు.

అత్తే హతమార్చింది

కోడల్ని చంపి.. అనుమానం రాకుండా నటించి..

- మట్టికుప్పల కింద కూరుకుపోయిన మృతదేహం
- శంషాబాద్ మండలం సాతంరాయిలో ఘటన
- రెండు నెలల తర్వాత వెలుగు చూసిన దారుణం


మట్టి దిబ్బల కింద నుంచి డోలి మృతదేహాన్ని వెలికి తీస్తున్న జేసీబీ హతురాలు డోలి (ఫైల్)

శంషాబాద్ రూరల్: అత్త చేతిలో కోడలు దారుణ హత్యకు గురైన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు, హతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. శంషాబాద్ మండలం రామంజాపూర్ తండాకు చెందిన ముడావత్ సూర్య అలియాస్ సురేష్‌కు, అదే తండాకు చెందిన డోలి (40)తో ఇరవై ఏళ్ల కిందట వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు. సురేష్ డీసీఎం వాహన డ్రైవర్‌గా పని చేస్తుండగా.. డోలి కూలీ పని చేస్తుండేది. సురేష్ తల్లిదండ్రులు తులసి, అనంతి కొన్నేళ్ల నుంచి సాతంరాయి వద్ద ఉన్న వ్యవసాయ క్షేత్రంలో పని చేస్తూ అక్కడే నివాసముంటున్నారు. సురేష్ చిన్నకొడుకు మనోహర్ వీరి వద్దనే ఉండేవాడు. సురేష్ దంపతులు, పెద్ద కొడుకుతో కలిసి రామంజాపూర్ తండాలో నివసిస్తున్నారు. సురేష్ తరచూ మద్యం తాగి వచ్చి భార్యతో గొడవ పడేవాడు. ఈ క్రమంలో గత నవంబర్ 10న డోలి అదృశ్యమైంది. అదే నెల 14న శంషాబాద్ పోలీసులకు భర్త ఫిర్యాదు చేశాడు.

అత్త వద్దకు వెళ్లి..

భర్తతో గొడవ పడిన డోలి సాతంరాయిలో ఉన్న అత్తామామల వద్దకు వెళ్లింది. అదే రోజు రాత్రి వ్యవసాయ క్షేత్రానికి ఎదురుగా ఉన్న నిర్మానుష్య ప్రదేశానికి బెంగళూరు జాతీయ రహదారి దాటి ఇద్దరు వెళ్లారు. అక్కడ ఇద్దరు కలిసి కల్లు తాగారు. మత్తులో ఉన్న డోలిని హత్య చేసిన తులసి అక్కడి నుంచి ఏమీ తెలియనట్లు ఇంటికి వెళ్లింది. తర్వాత కోడలి కోసం కుటుంబ సభ్యులతో కలిసి వెతికినట్లు నటించి తనపై అనుమానం రాకుండా చూసుకుంది. నిర్మానుష్య ప్రదేశంలోని డోలి మృతదేహం ఉన్న ప్రాంతంలో కొంత కాలంగా వెంచర్ నిర్వాహకులు భారీగా మట్టిని పోగు చేస్తున్నారు. లారీల్లో వేరే చోట నుంచి తెచ్చిన మట్టిని పోస్తున్నారు. ఈ మట్టి కుప్పల కింద మృతదేహం కూరుకుపోవడంతో ఎవరికీ కనిపించలేదు.

మృతురాలి కుమారుడికి సందేహం రావడంతో..

రెండు రోజుల క్రితం మృతురాలి పెద్ద కుమారుడు తండా నుంచి సాతంరాయిలోని నానమ్మ తులసి వద్దకు వచ్చాడు. కోడలిని హత్య చేసిన భయంతో ఉన్న తులసి.. మనవడితో మాట్లాడిన తీరు అనుమానాలను రేకెత్తించింది. దీంతో అతను తండాకు వచ్చి తన మేనమామ హరికి విషయం చెప్పాడు. కుటుంబ సభ్యులు సాతంరాయిలో తులసి వద్దకు వెళ్లి మృతురాలి చిన్న కొడుకు మనోహర్‌తో మాట్లాడారు. తన తల్లి ఇక్కడికి వచ్చిన విషయం ఎవరికి చెప్పవద్దని.. లేదంటే చంపేస్తానని నాన్నమ్మ బెదిరించినట్లు చెప్పడంతో.. విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. తులసిని అదుపులోకి తీసుకుని విచారణ చేయడంతో హత్య విషయం వెలుగు చూసింది. దీంతో గురువారం పోలీసులు రాజేంద్రనగర్ ఎమ్మార్వో రాములు పర్యవేక్షణలో ఘటనా స్థలంలో మట్టి దిబ్బల కింద మృతదేహాన్ని వెలికి తీశారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోవడంతో ఉస్మానియా వైద్యులు అక్కడే పోస్టుమార్టం నిర్వహించారు. డోలి హత్యకు తులసి భర్త అనంతితో పాటు ఇతని సోదరుడు హనుమ సహకరించినట్లు తెలిసింది. హత్యకు గల కారణాలు తెలియరాలేదు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.